3 నుంచి జిల్లా స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో ఆగస్టు 3న స్థానిక కలెక్టరేట్‌లో గల పిజిఆర్ఎస్‌సెల్ (గ్రీవెన్సెస్ సెల్, సెల్లార్)లో ఉదయం 8 గంటల నుంచి పోటీలు జరుగుతాయనియోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మంచిపల్లి శ్రీరాములు, మోహన్ గంతాయత్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఏజ్ గ్రూపులు 10 -14, 14-18, 18-28, 28-35, 35-45, 45-55 వయస్సు గల పురుషులు/స్త్రీలు కేటగిరీల్లో నిర్వహించబడతాయన్నారు. ప్రతి అథ్లెటిక్ తన ఏజ్ గ్రూపులో రెండు ఈవెంట్స్‌లో మాత్రమే పాల్గొనేందుటకు అవకాశం ఉందన్నారు. ప్రవేశ రుసుం రూ.100 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు గౌరీశంకర్, 9866650998 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ఆఖరు తేదీ ఈనెల 31 వరకు మాత్రమేనని పేర్కొన్నారు.

ప్రాథమిక వైద్యం... ఎంతో దూరం

- గిరిజనులకు తప్పని వెతలు
- మార్గం మధ్యలోనే ప్రసవాలు
- సకాలం వైద్యమందక గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

ప్రజాశక్తి - మక్కువ

గిరి శిఖర ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు ప్రాథమిక వైద్యం నేటికీ అందని ద్రాక్షలాగే ఉందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. మండలంలో చాలావరకు గిరిజన ప్రాంతమంతా గిరి శిఖరాలపైనే ఆవాసాలు ఏర్పర్చుకొని నివసిస్తున్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో ప్రధానమైంది ప్రాథమిక వైద్యం వీరికి ఎంతో దూరంగా ఉంటుందని చెప్పడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదని చెప్పవచ్చు. శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాదాపు 90 శాతం మేర గిరిజన ప్రాంతంతో ముడిపడి ఉంది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గిరిజనులకు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. గిరిజన ప్రాంతానికి వెళ్లాల్సిన సిబ్బంది దుగ్గేరు సబ్ సెంటర్‌కే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వారపు సంతలైన బుధ, గురువారాల్లో గిరిజనులు వచ్చి సబ్ సెంటర్లో వైద్య సేవలు పొందాల్సిన దుస్థితి నెలకొంది. కొండ శిఖర గ్రామాల నుంచి గర్భిణీలు డోలీలతోనూ దుగ్గేరు వచ్చి, ఆటోలతో అక్కడ నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవాల్సింది పరిస్థితి. ఈ ప్రయాణంలో కొంతమంది మార్గమధ్యలో ప్రసవాలు కాగా, గతంలో మార్గమధ్యలో గిరిజన రోగులు ప్రాణాలు ఎన్నో గాల్లో కలిసిన దుస్థితి నెలకుంటుందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా ఎర్రసామంత వలస, అనసభద్ర ఆశ్రమ, ఏకలవ్య పాఠశాలలో చదివే గిరిజన విద్యార్థులకు కూడా అస్వస్థతకు గురైతే అవస్థలు తప్పడం లేదు. దూరంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లలేక చాలా వరకు నేరుగా జిల్లా ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని వారంతా వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించి సకాలంలో వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

హామీగా మిగిలిన దుగ్గేరు పిహెచ్‌సి

ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారి గిరిజనులకు అందుబాటులో ఉండేలా దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పిహెచ్‌సి) ఏర్పాటు చేస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం పరిపాటిగా మారిపోయింది. దాదాపు 20 ఏళ్లుగా దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. అయినా పాలకులకు స్పందించడం. ఇప్పటికైనా పాలకులు స్పందించి తక్షణమే దుగ్గేరులో పిహెచ్‌సి ఏర్పాటు చేసిన గిరిజనులకు ఆరోగ్యసేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోగిని డోలీపై ఆసుపత్రికి తరలిస్తున్న గిరిజనులు (ఫైల్)

దూరమైనా పార్వతీపురం వెళ్లిపోతాం

శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే చాలా దూరం. ఇక్కడి నుంచి మక్కువ వెళ్లి, మళ్లీ అక్కడ నుంచి శంబర ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. రహదారులు బాగోలేనందున రాత్రి వేళల్లో మరీ ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే చిన్న చిన్న జ్వరాలు వచ్చినా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లిపోవాల్సి వస్తుంది. ప్రభుత్వాలు అదిగో ఇదిగో అంటున్నాయి గాని గిరిజనులకు అందుబాటులో ఆసుపత్రిని ఏర్పాటు చేయటం లేదు.

కె.దొర, బాగుజోల.

దుగ్గేరులో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గిరి శిఖర గ్రామాల ప్రజలకు అందుబాటులో లేదు. దుగ్గేరులో సబ్‌సెంటర్ ఉన్నప్పటికీ ప్రయోజనం అంతంత మాత్రమే. సబ్ సెంటర్ స్థానంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే గిరిజనులందరికీ మేలు చేకూరుతుంది. ప్రస్తుతం ఆరోగ్య కేంద్రం దూరం కావడం వల్ల మక్కువ, పార్వతీపురం ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుంది. గిరిజన సమస్యలను ప్రభుత్వం గుర్తించి దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి,

కె లోద్ర, మెండంగి.

మంత్రా.. మజాకా!

- కెజిబివిలో ఊస్టింగ్ రోజే వంట మనుషులకు పోస్టింగ్
- రూ.లక్షన్నరకు తెలుగు తమ్ముళ్లు బేరం పెట్టారంటూ ఆరోపణలు

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని కరాసువలస కెజిబివిలో నలుగురు వంటమనుషులను సస్పెండ్ చేసిన రోజు సాయంత్రమే కొత్త వంటమనుషులను నియమించారు. ఈనెల 15 సాయంత్రం కెజిబివిని సందర్శించిన జిల్లా అధికారి ఒకరు ఎస్ఒ ప్రశాంతి సహా నలుగురు వంట మనుషులకు సస్పెన్షన్ ఆర్డర్ కాపీలు అందజేశారు. ఆ ఆర్డర్ కాపీలు అందుకున్న నలుగురు వంటమనుషులు ఇంటికి వెళ్ళక ముందే వారి స్థానంలో కొత్తగా నలుగురు వంటమనుషులను నియమించారు. ఎస్ఒ ప్రశాంతి స్థానంలో అక్కడ పని చేస్తున్న మేథ్స్ లెక్చరర్ షేక్ షబ్నమ్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే వంటమనుషులను తొలగిస్తారనే విషయం ముందుగానే తెలుసుకున్న మంత్రి సంధ్యారాణి తన అనుచరులకు చెప్పడంతో కొత్తవారి నియామకానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. నాలుగు వంటమనుషుల పోస్టుల భర్తీకి అధికారులు ఎటువంటి ప్రక్రియ ప్రారంభించక ముందే తెలుగు తమ్ముళ్లు పంచుకున్నారు. వంటమనుషుల తొలగింపు ఖాయమన్న సంకేతాలు అందడంతో మంత్రి సంధ్యారాణి ఆ పోస్టులను ఇద్దరు నాయకులకు తలా రెండు సర్దేశారు. రెండు వంటమనుషుల పోస్టులు కరాసువలసకు చెందిన నాయకుడికి, మరో రెండు పోస్టులు పట్టణానికి చెందిన ఓ కౌన్సిలర్‌కు కేటాయించారు. మంత్రి ఆదేశాలే శిరోధార్యంగా భావించిన తెలుగు తమ్ముళ్లు వంట మనుషుల పోస్టులకు బేరం పెట్టేశారు. ఒక్కో పోస్టుకు లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాత్కాలిక ప్రాతిపదికన నలుగురు వంట మనుషులను నెలకు రూ.7500 చొప్పున వేతనానికి నియమించారు. ఈ పోస్టులకు లంచమిచ్చినట్లు చెబితే ఉద్యోగాల నుంచి తీసేస్తామని హెచ్చరించి మరీ తెలుగు తమ్ముళ్లు జాగ్రత్త పడ్డారు. ఇక్కడ గమ్మత్తయిన విషయం ఏమిటంటే తొలగించిన రోజునే కొత్త వంట మనుషుల నియామకం చేపట్టడం చూసి' మంత్రా మజాకా'అని గుసగుసలాడుకుంటున్నారు.

22 నుంచి అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఆర్టీసీ డిపోలో అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె సైరన్ మోగనుంది. ఈనెల 22 నుంచి సమ్మెకు వెళ్లాలని నిర్ణయించినట్లు అద్దె బస్సు డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు కెవి చారి కార్యదర్శి పిడి ప్రసాద్ తెలిపారు. అద్దె బస్సు యజమానులతో రెండు దఫాలుగా జరిగిన చర్చలు ఫలించకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో సమ్మెకు వెళ్లనున్నట్లు చెప్పారు. అద్దె బస్సు డ్రైవర్లకు జీతాలు పెంచాలని, ఏడాదికి రెండు సార్లు యూనిఫాం పంపిణీ చేయాలని, ప్రతి సంక్రాంతికి బోనస్ మంజూరు చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సువర్ణ సమక్షంలో డ్రైవర్ల సంఘం నాయకులు, సిఐటియు నాయకులు, బస్సు యజమానులతో చర్చలు జరిగాయి. అయితే డ్రైవర్ల జీతాలు పెంచడానికి యజమానులు అంగీకరించకపోవడంతో సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆర్టీసి డిపోలో 38 అద్దె బస్సు లున్నాయి. ఒక బస్సుకు ఇద్దరు డ్రైవర్లు చొప్పున 76మంది పని చేస్తున్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో డిఐజి తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి మన్యం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి విచ్చేశారు. తొలుత ఆర్మ్డ్ రిజర్వు పోలీసులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గార్డు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తదుపరి ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం, పోలీసు కార్యాలయం, డిసిఆర్‌బి, స్పెషల్ బ్రాంచ్, పాస్‌పోర్టు విభాగాలను సందర్శించి రికార్డులు నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ సెక్షన్లు, విధులు నిర్వహించే కార్యాలయ అధికారులు, సిబ్బంది వారి విధులు గురించి అడిగి తెలుసుకొని, వారు నిర్వహించే వివిధ రికార్డులను, పోలీసు సిబ్బంది అర్జీలు, ఉన్నత పోలీసు అధికారులు, కార్యాలయాలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన స్టోర్ ఆర్టికల్స్ వివరాలు, రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. అదే విధంగా జిల్లా నేర రికార్డు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, పాస్ పోర్టు సెల్ అధికారులు, సోషల్ మీడియా, సైబర్ సెల్ విభాగాల్లో విధులు నిర్వర్తించే సిబ్బందిని వారి వారి విధులు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి రికార్డులను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా సాయుధ దళాల ఆర్మ్డ్ రిజర్వు పోలీసుల పని తీరు, ఆయుధాలు, రికార్డులు, మోటారు వాహనాలు, ఉపయోగం, నిర్వహణ, వాటి పని తీరు, రికార్డులు నిర్వహణ తనిఖీ చేసి పోలీసుల సంక్షేమానికి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను డిఐజిని అడిగి తెలుసుకున్నారు. పోలీసుల సంక్షేమానికి పోలీసుశాఖ చేపడుతున్న కార్యక్రమా లను, పోలీసు సిబ్బంది, కార్యాలయం సిబ్బంది పనీ తీరు జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, డిఐజి వారికి వివరించారు. ఈ తనిఖీల్లో ఎఎస్‌పి అంకిత సురాన, పాలకొండ డిఎస్పీ రాంబాబు, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, డిపిఒ ఎఒ సతీష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ రఘునాథం, డిసిఆర్‌బి సిఐ ఆదాం, సోషల్ మీడియా, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు, ఎఆర్ ఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, డిపిఒ, ఎస్బీ, డిసిఆర్బి, సైబర్ సెల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న డిఐజి గోపినాథ్ జెట్టి

ప్లాస్టిక్ రహిత సమాజానికి నాంది పలకండి

జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదబొండపల్లిలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామంలో ఇంటింటికీ రెండు రకాల డస్ట్ బిన్లను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసేందుకు ఈ డస్ట్ బిన్లను ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. ప్లాస్టిక్‌రహిత సమాజానికి నాంది పలకాలని పేర్కొన్నారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల్లో దేనికైనా గుడ్డ సంచులను వినియోగిస్తారని, అలాగే జిల్లాలో కూడా ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలికి గుడ్డ, పర్యావరణానికి హానికరం లేని వస్తువులను వినియోగించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పర్యావరణం బాగుంటుందని, తద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధం పట్ల అవగాహన పెంచుకొని ప్లాస్టిక్ రహిత సమాజంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తొలుత అదే గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, డిఆర్‌డిఎ ఏర్పాటు చేసిన గుడ్డ సంచుల విక్రయ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, ఎమ్మెల్యేతో కలిసి సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛఆంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను గ్రామ ప్రజలతో చేయించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్సాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. గుడ్డ సంచుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ గుడ్డ సంచులను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిపిఒ టి.కొండలరావు, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, ఇతర అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత జీవన సరళిపై ప్రచారం

జిల్లాలో ప్లాస్టిక్ రహిత జీవన సరళిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి డా. నారాయణ భరత్ గుప్తా తెలిపారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నో ప్లాస్టిక్ జోన్‌పై గోడ పత్రిక కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జెసి ఎస్ఎస్ శోభిక, డిఆర్ఒ కె.హేమలత తదితరులతో కలిసి జిల్లా ప్రత్యేక అధికారి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులను (క్లాత్ బ్యాగ్స్) వినియోగించాలని పిలుపునిస్తూ, గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనార్థాలు, పర్యావరణంలో కలిగే మార్పులపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ, నో ప్లాస్టిక్ జోన్లపై ప్రజలకు చైతన్యం కలిగించాలని ప్రత్యేక అధికారి పేర్కొన్నారు.

గుడ్డ సంచులను అందజేస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో

పార్వతీపురం టౌన్: స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం చుట్టు పక్కల ఉన్న పరిసర ప్రాంతాలు, అదేవిధంగా డిసిఆర్బి, ఎస్బి, కమ్యూనికేషన్, మహిళా సెల్, డిపిఒ, ఆర్మ్డ్ రిజర్వు ఆఫీసులు ప్రాంగణం చుట్టుపక్కల ఉన్న పరిసరాల్లో ఉండే చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను, పచ్చికను తొలగించి, ప్లాస్టిక్ వస్తులు లేకుండా పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు నాయుడు, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, డిసిఆర్‌బి, ఎస్బి, కమ్యూనికేషన్, మహిళా సెల్, డిపిఒ, ఆర్మ్డ్ రిజర్వు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..

ఐటిడిఎలో...

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యాలయ పరిసరాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పిఒతో పాటు అధికారులు శుభ్రం చేశారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చినబాబు, డిడి అన్నదొర, ఎఒ వి.సునీల్, పిహెచ్‌ఒ వెంకటగణేష్, అకౌంట్స్ ఆఫీసర్ విజయరాణి, ఎఎంఒ కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి సిబ్బంది అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలి

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్, ఎంప్లాయీస్ జెఎసి డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు మండలంలోని కరాసువలస కెజిబివి ఎస్ఒ ప్రశాంతితో సహా సిబ్బంది అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ ప్రభుత్వ పథకాలు, సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై వేధింపులు పెరిగాయని, చిన్న చిన్న కారణాలతో తొలగింపులకు, సస్పెన్షన్లకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, విఒఎలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులను, మున్సిపల్ కార్మికులను అకారణంగా తొలగించారని, ఇప్పుడు కెజిబివి సిబ్బంది వంతు వచ్చిందని విమర్శించారు. కరాసవలస కెజిబివిలో మంత్రి సంధ్యారాణి పర్యటన సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న ఆహారంలో నాణ్యత లోపించిందని గుర్తించారని, దీనికి హెచ్చరిస్తే సమసి పోయే సమస్యను అదే కారణంగా చూపించి ఏకంగా ఎస్ఒతో పాటు నలుగురు వంట సిబ్బందిని సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారుల పరిశీలనలో ఎస్ఒ ప్రమేయం లేనప్పటికీ ఆమెను బాధ్యునిగా చేసి సస్పెండ్ చేయడం సమంజసం కాదని అన్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఉద్యోగులతో సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలి తప్ప ఇలా వేధింపులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కరాసవలస కెజిబివి సిబ్బందిపై విధించిన సస్పెన్షన్ తక్షణమే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు జివి రమణ, బి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేపాకులు తింటూ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెలో భాగంగా శనివారం వేపాకులు తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు దావాలా రమణారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెబుతున్నప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదన్నారు. చర్చల పేరున గత పది నెలలుగా కాలయాపం జరుగుతుందన్నారు. అందుకే ఈనెల 12న అర్ధరాత్రి రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక నగర పంచాయతీలో ఇంజినీరింగ్ విభాగ కార్మికులు సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. షరతుల్లేకుండా తల్లికి వందనంతో పాటు ఇతర సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తింపు చేయాలన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, పెంపు కేటగిరి నిర్ణయ విషయంలో జరిగిన పొరపాట్లు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. గత 17 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు జీవోలు ఇవ్వాలన్నారు. సంబంధిత మంత్రి కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమ్మె విరమించేలా చూడాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లే కుండా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో వై.హరిబాబు, పి.సాయి, ఎస్.బాబురావు, టి.వెంకటరమణ, ఐ.రాజు, టి.ఈశ్వర్‌కుమార్, ఎస్.మహేష్, పి.సాయి, జి.నారా యణ, బి.సురేష్, ఎస్.అరవిందు, పి.సతీష్, పి.రమేష్ పాల్గొన్నారు.

వేపాకులను తింటూ నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

బదిలీలు జరిగి రెండు నెలలైనా ఐడి లేవీ?

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ముగిసి రెండు నెలలైనా వారికి పొజిషన్ ఐడిలివ్వకపోవడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధ్యాయులకు రెండు నెలల జీతాలు అందలేదని చెప్పారు. మోడల్ ప్రైమరీ స్కూల్, మోడల్ పాఠశాలల్లో, క్లస్టర్ స్కూళ్లలో నియమించిన ఉపాధ్యాయులకు ఆర్థిక అనుమతి తెప్పించుకోవడంలో రాష్ట్ర అధికారులు అలసత్వం వహించారని విమర్శించారు. వెంటనే ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడిలు మంజూరు చేయాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ప్రతీ గ్రామం ఒడిఎఫ్ ప్లస్ కావాలి

పార్వతీపురం: ప్రతి గ్రామం బహిరంగ మలవిసర్జన రహిత (ఒడిఎఫ్ ప్లస్) గ్రామం కావాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బహిరంగ మలవిసర్జన వలన గ్రామాల్లో అనారోగ్యకర పరిస్థితులు తలెత్తుతున్నాయని గ్రహించాలని ఆయన పేర్కొన్నారు. వర్షాకాలంలో వీటి ప్రభావం ఎక్కువగా ఉంటుందని తద్వారా అతిసారం వంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బహిరంగ మలవిసర్జనరహిత పరిసరాలకు సహకరిస్తామని డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు.

ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో నిర్మాణం జరుగుతున్న గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులను స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ రాజశేఖర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 26న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయావని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టి గిరిజన విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించినట్టు తెలిపారు. దీనికి సిఎం స్పందించి ఎపి స్టేట్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలించి నివేదికను అందజేయాలని సూచించగా ఆయన వచ్చి కళాశాల నిర్మాణ పనులు పరిశీలించి నిర్మాణ పనుల వివరాలు ప్రస్తుతం ఎంత శాతం జరిగాయి, నిధులు ఎంత విడుదలయ్యాయి, ఇంకా ఎంత అవసరమో తదితర వివరాలను సంబంధింత ఇంజినీరింగ్ అధికారుల ద్వారా సమాచారం తెలుసుకున్నారని తెలిపారు. ఈ నివేదికను ముఖ్యమంత్రికి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, టిడిపి నాయకులు పోలూరు శ్రీనివాసరావు, సువ్వాన గోవింద, ఇంజనీరింగ్ అధికారులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ కాలేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, అధికారులు

కంచే చేను మేస్తే... కాపాడేదెవరు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కంచే చేను మేస్తే కాపాడేదెవరు? అన్నట్టుగా ఉంది విజయనగరంలోని మహారాజా రైతుబజారు స్థలంలో జరిగిన విన్యాసాల తీరు. ఇప్పటి వరకు టిడిపి నేత, ఇక నుంచి గోవా రాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరించబోయే పూసపాటి అశోక్ గజపతిరాజు మూడు రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌ను కలవడం, ఆ వెంటనే రైతుబజారును ఖాళీచేయించేందుకు ఆదేశాలు వెలువడడం, రైతులు, నగర వాసులు ఆందోళన చెందడం, పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టడం విధితమే. దీంతో, ఈ వ్యవహారం ఉమ్మడి జిల్లాలో దావణంలా పాకింది. ఏమూల విన్నా దీని గురించే పబ్లిక్ టాక్. ప్రభుత్వ స్థలాన్ని రాజుగారికి ఇచ్చేశారట. ఆయనే తీసుకున్నారట అంటూ చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఈ స్థలం రాజుగారిదైతే ఇన్నాళ్లూ రైతు బజారు ఎందుకు నడిచింది. అందులో రైతులు చెల్లించిన అద్దెలు (నెలకి రూ.70వేలు) ప్రభుత్వానికి ఎందుకు వెళ్లాయి? రాజుగారికిగానీ, ఆయన ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న మాన్సాస్‌కుగానీ ఎందుకు వెళ్లలేదు? అంటూ జనం తమలో తాముగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్నా అటు ప్రభుత్వం నుంచిగానీ, ఇటు రాజుగారి నుంచిగానీ సమాధానం లేదు. దీంతో, రాజకీయ పలుకుబడి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇంతకు తెగించారా? అన్న విమర్శలకు కూడా జనం తగ్గడం లేదు. వాస్తవానికి ఈ స్థలం పూర్వం విజయనగరం సంస్థానంలో ఉండేదని, 1968లో సంస్థానాల రద్దుతో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిందని, అప్పటి అవసరాల రీత్యా ఇక్కడ జిల్లా కేంద్రాసుపత్రి నడిపారని, దాన్ని ఖాళీచేసిన తరువాత సాక్షాత్తు టిడిపి ప్రభుత్వమే రైతు బజారు ఏర్పాటు చేసిందని నగరంలోని నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా స్పందిస్తున్నారు. దీనిపై ఎక్కడా సమాధానాలు వినిపించడం లేదు. కనీసం ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న వైసిపి కూడా దీనిపై స్పందించక పోవడంతో అధికార ప్రతిపక్షాలు అవగాహనా రాజకీయాలకు ఒడిగట్టాయంటూ కొందరి నోట వినిపిస్తున్న మాట. ప్రజల ఆవేదనలో అర్థం లేకపోలేదు. రైతు బజారు ఖాళీచేయడమంటే రైతులను ఉపాధి నుంచి దూరం చేయడం మాత్రమే కాదని, రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలాన్ని ప్రజలకు సమాధానం చెప్పకుండా కొట్టేయడమని జనం వాదన. ఈ మాట కొస్తే మహారాజా రైతు బజారు మాత్రమే కాదు, నగరంలో ఎటుచూసిన విజయనగర రాజుల పేర్లు, స్మృతులు, చరిత్ర లేకుండా ఏవీ లేవు. కానీ, నాటి రాజభరణాలు, రాచరిక వ్యవస్థ ఎప్పుడో రద్దయ్యాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ అమల్లో ఉంది. ఈ మార్పు జరిగిన సందర్భంలోనే రాజావారు చాలా వరకు మాన్సాస్ ట్రస్టుపెట్టుకుని, అందులో వేల ఎకరాల భూములు, భవనాలు, ఆలయాలు ఇముడ్చుకున్నారని, ఆ సామ్రాజ్యమంతా వారి ఆధీనంలో ఉంచుకున్నారనే చర్చ ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో విస్తృతంగానే సాగుతోంది. ఇంత జరుగుతున్నా గుంభనంగా వ్యవహరిస్తున్నారంటే రాజకీయ అండదండలతో ప్రత్యేకమైన జీఒలు తీసుకొచ్చి భూమిని వశపర్చుకుని ఉండవచ్చనే చర్చ నడుస్తోంది. ఇలా చట్టాల్లోవున్న లొసుగులను, అధికారాన్ని ఉపయోగించుకుని అవకాశం దొరికిన చోట ఎవరికివారే ప్రభుత్వ భూములను ఆధీనంలోకి తీసుకుంటే భవిష్యత్తు అవసరాలు ఏమౌతాయని జనం ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు సిపిఎం తప్ప, వైసిపి సహా ఇతర రాజకీయ పార్టీలేవీ తమ వైఖరి తెలియజేయకపోవడం గమనార్హం. కంచె చేనుమేసేసినట్టుగా ఉందని పబ్లిక్ టాక్.

ప్రజాశక్తి
www.prajasakti.com

గండిపడిన చెరువును పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

పనుకు చెరువు గండి పూడ్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని తూరుమామిడిలో పనుకు చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండి పడిందని, వెంటనే గండి పూడ్చాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. గండి పడిన పనుకు చెరువును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది వెంగళరాయ సాగర్ పరిధిలో గల చెరువులు, కాలువలు మరమ్మతులు చేయకపోవడంతో విచ్ఛిన్నమైన కాలువలు, చెరువుల గండ్లు పడతాయని, రానున్న సీజన్‌లో చివరి భూములకు నీరువెళ్లడం కష్టమని అన్నారు. పనుకు చెరువు కింది భాగంలో సుమారు 200 ఎకరాలకు సాగు నీరందించాలని అటువంటి చెరువు గండిపడడంతో 200 ఎకరాల ఆయకట్టకు నీరు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సుమారు 6 నెలల పాటు వేసవిలో ఉపాధి హామీలు పనులు జరిగిన పనులు జరపలేదని, దీనివల్ల తూటి బలిసిపోయి నీరు కదిలే పరిస్థితి లేకపోవడంతో గండి పడిందని అన్నారు. గండి పడడంతో సుమారు 5 ఎకరాల భూమి నష్టపోయిందని, రైతులకు నష్టపరి హారం ఇవ్వాలని, వెంటనే ప్రభుత్వం గండి పూడ్చి 200 ఎకరాల భూమికి సాగునీరందించాలని డిమాండు చేశారు.

రైతు సేవా కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

సకాలంలో ఎరువులు అందజేయాలి

ప్రజాశక్తి - కురుపాం

రైతులకు సకాలంలో ఎరువులు అందజేయాలని సిపిఎం మండల కార్యదర్శి కోరంగి సీతారాం డిమాండ్ చేశారు. జియ్యమ్మవలస మండలంలో డంగభద్ర రైతు సేవా కేంద్రం వద్ద రైతులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ముమ్మరంగా వరి నాటుతున్న సమయంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, ఖరీఫ్ సీజన్ సంభవించిన అధికారులు ఎందుకు ముందస్తు ఎరువులను తీసుకొచ్చి రైతు సేవ కేంద్రంలో ఉంచలేదడంలేదో అర్థం కావడం లేదని, ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి వారం రోజుల్లో యూరియా, మిగత ఎరువులు రైతులకు సబ్సిడీ ద్వారా అందించాలని, లేనిచో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కల్వర్టు పనులు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ పరిధిలో ఉన్న 25, 26 వార్డుల పరిధిలో ఉన్న వేమకోటి వారి వీధి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ, కల్వర్టు పనులను నాణ్యత ప్రమాణాలతో శరవేగంగా పూర్తిచేసి వాడుకలోకి తీసుకురావాలని అన్నారు.

ప్రభుత్వ విప్ ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి మంచినీరు, రోడ్డు తదితర సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు ఇచ్చారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే సమస్యల గురించి సంబంధిత అధికారులకు తెలియజేస్తూ వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

గడగమ్మలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి సచివాలయం పరిధిలో గల గడగమ్మలో శనివారం స్థానిక వైద్యాధికారి సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఓ.శుభారతమని, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తయారీకి సహకరించండి

ప్రజాశక్తి -పాలకొండ

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల మార్పులు, కొత్తవి ఏర్పాటుపై కూడా పార్టీ ప్రతినిధులతో చర్చించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 1200 మంది ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిటి శేఖరం, కనపాక సూర్యప్రకాష్ (వైసిపి), దావాల రమణారావు (సిపిఎం), కె.కాశీనాయుడు (టిడిపి), సంతోష్‌కుమార్ (జనసేన), తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం నాయకులు కొల్లి సాంబమూర్తి, గంగరాజు, లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ గడిచిన 15 రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు ఏజెన్సీ ప్రాంతాల్లో విపరీతమైన మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో గిరిజన ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. కావున అన్ని గిరిజన గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం గిరిజనులకు అందించేలా చూడాలనికోరారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాని కోరారు.

గోతులను పూడ్చండి

ప్రజాశక్తి -సీతానగరం

సీతానగరం - చినభోగిలి గ్రామాల మధ్య అండర్ గ్రౌండ్ పనులు జరిగే చోట రోడ్డు చాలా దారుణంగా తయారైంది. గత పదిరోజులుగా రాత్రిపూట అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏదైనా దురదృష్టవశాత్తు జరిగి ప్రాణాలు పోయినప్పుడు అయ్యో పాపం.. అనేకంటే ముందుగా స్పందించాలని కోరుతున్నారు. కోట్లాది రూపాయలతో పనులు చేస్తున్న రైల్వే గుత్తేదారులు, పక్కనే సీతానగరం వంతెన నిర్మిస్తున్న వంతెన గుత్తేదారులు అక్కడే ఉన్న సమస్య తమకు సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మానవతా దృక్పథంతో రోడ్డును తక్షణమే బాగు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గతుకులమయమైన సీతానగరం-చినబోగిలి రోడ్డు

సీతంపేటలో ప్లాస్టిక్ దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ దుష్ప్రభావంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి, ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని డిఐఒ డాక్టర్ జగన్ మోహనరావు కోరారు. శనివారం స్థానిక పిహెచ్‌సిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిహెచ్‌సి ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి పరిసరాలను శుభ్రం చేసి అందరిచే స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్‌ఎంకె తిరుమల ప్రసాద్, ఎపిడిమియాలజిస్ట్ డా కౌశిక్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ వర్మ, డెమో సన్యాసిరావు, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్లు జగదీశ్వర్, ఉదయకుమారి, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర పై గుమ్మలక్ష్మీపురంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థులు, అధికారులతో కలిసి ఆమె ప్రతిజ్ఞ చేశారు. అలాగే భద్రగిరి ఆసుపత్రిలో రోగులకు, వైద్య సిబ్బందికి బ్యాగులు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎంఇఒ చంద్రశేఖర్, ఐకెపి, ఐసిడిఎస్ ఉద్యోగులు, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు అధ్యాపకులు పాల్గొన్నారు.

కురుపాం : ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటుకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమార్ స్వామి అన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల పరిసరాల్లో సిబ్బంది, విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రపరిచారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ ప్రత్యేకాధికారి వైకుంఠరావు, నగర పంచాయతీ కమిషనర్ రత్నకుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ సిటీ మిషన్ మేనేజర్ దుంపల కృష్ణారావు తదితరులు ఉన్నారు.

కొమరాడ :మండలంలోని అర్థంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎస్ రమేష్ గ్రామాల్లో షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించకూడదని వివరించారు. ఇంట్లో వద్ద ప్లాస్టిక్ వినియోగం వాడకం చేయకుండా ఉండాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ, పంచాయితీ కార్యదర్శి సురేష్, కాలి శెట్టి శంకరరావు, పట్నాన శంకరరావు, కె.నాగభూషణరావు, గంగరాజు,పద్మ, లోకేష్,పోలి మొదలగు వారు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలో స్వచ్ఛంద-స్వచ్ఛభారత్ ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది పరిశుభ్రత పాటిస్తూ చెత్తాచెదారం తీసివేసే అనంతరం అన్ని శాఖ అధికారులతో బజారు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎవిఎస్ ప్రసాద్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఈ కార్యక్రమాన్ని అన్ని పంచాయతీల్లోనూ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బందితో ర్యాలీలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ వెలుగు, వైద్య, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంట : ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ, పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాంచాలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యుగంధర్ ఉదారతను చాటుకుంటూ 400 మంది పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్ ను తన సొంత డబ్బులతో కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తానని తెలిపారు. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ అనంతరం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు పలువురు అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు

పాచిపెంట : పాంచాలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

వీరఘట్టం : మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ఎంపిడిఒ బి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వద్దకు వరకు. ర్యాలీగా వెళ్లి ప్లాస్టిక్ వల్ల జరిగే అనార్ధాలు ఆరోగ్యానికి హానికరాలు, ప్లాస్టిక్ వద్దు కాటన్ ముద్దు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి, ఆరోగ్యంగా ఉండాలి అంటూ ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ప్రతి షాప్‌నకు వెళ్లి ప్లాస్టిక్ అమ్మ రాదని వ్యాపారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఇఒ బి కోటేశ్వరరావు, జూనియర్ సహాయకులు ఎ.నర్సింగరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ జె.జ్ఞానమ్మ, విఎఒలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కుసిమి, సీతంపేట పంచాయతీల్లో ప్లాస్టిక్ నిషేధంపై మండల ప్రత్యేక అధికారి చిన్నబాబు, ఎంపిడిఒ బిబి మిశ్రో అవగాహన కల్పించారు.. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కె.సత్యం, కార్యదర్శి రామకృష్ణ, రాజారావు, హెచ్ఎం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

ఆరోగ్య కార్యకర్తల నియామకం ఎప్పుడు?

దోమతెరలు పంపిణీ చేయాలి : మండల సర్వసభ్య సమావేశంలో చర్చ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో జ్వరాలు ప్రబలి ప్రజలు ఆసుపత్రి బారిన పడుతున్నారని, వారికి మెరుగైన సేవలందించి ప్రాణాలకు రక్షణ కల్పించాలని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి మెరుగైన సేవలందించేలా సంబంధిత వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించి స్థానికంగా గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందిస్తామని స్వయంగా గిరిజన మంత్రి ప్రకటించి ఏడాది గడుస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దీంతో నిత్యం విద్యార్థులు ఏదో ఒక అనారోగ్యంతో ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సి వస్తుందని అన్నారు. ఒక్కొక్క సమయంలో మెరుగైన సేవలందకపోవడంతో మృత్యువాతపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గిరిజనులకు దోమతెరలు పంపిణీ చేయాలని చెముడుగూడ ఎంపిటిసి సభ్యులు మండంగి రమణ కోరారు. గ్రామాల్లో స్ప్రేయింగ్ చేసేటప్పుడు ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. గిరిజన ప్రాంతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజా ప్రతినిధులంతా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించాలని అన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్తు, రోడ్లు తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని ఎంపిపి కోరారు.

సమావేశంలో ఎంపిడిఒ త్రివిక్రమ్ రావు, తహశీల్దార్ శేఖర్, జెడ్‌పిటిసి రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

గవర్నర్ ఆదేశాలను అమలు చేయాలి

- డిఇఒ పై చర్యలు తీసుకోవాలి
- మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ప్రజాశక్తి - బలిజిపేట

గిరిజన, రజక చిరుకార్మికులపై వేధింపులు ఆపి, న్యాయస్థానం ఆదేశాలను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ జాయింట్ సెక్రటరీ ఆదేశాలను తక్షణమే అమలు చేసి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, అలాగే వారి జాయినింగ్‌పై ఎంఇఒకు ఫోన్ ద్వారా బెదిరింపులకు గురిచేసిన డిఇఒపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మండలం అరసాడకు చెందిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. అరసాడ ఎంపిపి పాఠశాలల-1లో గల గిరిజన మహిళ చిరు కార్మికులైన ఆయా, కుక్ కమ్ హెల్పర్ ను, జిల్లా పరిషత్ హై స్కూల్లోలో గల గిరిజన మహిళ కార్మికులైన కుక్ కమ్ హెల్పర్, రజక చిరు కార్మికులు కుక్ కమ్ హెల్పర్,నైట్ వాచ్ మెన్‌ను ఎస్ఎ సి, ఎండిఎం త్రీమెన్ కమిటీలు అన్యాయంగా విధులు నుంచి తొలగించాయని అన్నారు. తమకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం తమకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులను అమలు చేయమని కార్మికులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా అందుకు స్పందించి డిఇఒకు, ఎంఇఒకు, తహశీల్దార్‌కు, ఎంపిడిఒకు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రుల కమిటీ, చైర్మన్‌కు లేఖలు పంపించారని తెలిపారు. అయితే ఈ లేఖలను అమలు చేయకుండా డిఇఒ రాజ్‌కుమార్ తాత్సరం చేయమని ఎఇఒ శ్రీనివాస్‌పై బెదిరింపులకు పాల్పడడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి నాయకులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. విలేకరుల సమావేశంలో బాధితు కార్మికులు గడప పార్వతి, చిన్న పార్వతి, అరసాడ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

స్టాక్ వివరాలు ఇవ్వాల్సిందే

కార్యకర్తపై మంత్రి అనుచరుడు జులుం

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని నెలిపర్తిలో ఓ అంగన్వాడీ కార్యకర్తను స్థానిక టిడిపి నాయకుడు వేధింపులకు గురి చేయడం చర్చనీయాంశమవుతోంది. అంగన్వాడీ కేంద్రానికి ఎప్పటికప్పుడు సరఫరా అయ్యే సరుకుల వివరాలు తనకు తెలియజేయాలని, సరుకు తీసుకున్నప్పుడు తనను పిలవాలని ఆ నాయకుడు కార్యకర్తను బెదిరిస్తున్నాడు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆదేశాల మేరకే అంగన్వాడీ స్టాక్ వివరాలు తెలియజేయాలని కార్యకర్తను బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అంగన్వాడీ స్టాకు వివరాలు, రికార్డులు తమ ఉన్నతాధికారులకు చూపుతామని, టిడిపి నాయకులకు చూపించాల్సిన అవసరం లేదని అంగన్వాడీ కార్యకర్త చెపుతున్నా ఆ నాయకుడు వినిపించుకునే స్థితిలో లేడు. స్టాక్ వివరాలు చెప్పకపోతే మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్తామని ఆ తెలుగు తమ్ముడు హెచ్చరించారు కూడా. అయితే ఇప్పటికే ఆ అంగన్వాడీ కార్యకర్తపై స్థానిక టిడిపి నాయకుడు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. కేంద్రంలో అక్రమాలు జరిగాయని, విచారణ జరిపించాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. దీనిపై ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి, జిల్లా అధికారి కూడా విచారణ నిర్వహించారు. విచారణలో ఏ విధమైన తప్పులు కనిపించలేదు. దీంతో అధికారులు కార్యకర్తపై చర్యలు తీసుకోలేదు. అయినా సరే తగ్గకుండా ఆ నాయకుడు మంత్రి సంధ్యారాణికి చెప్పి ఆ కార్యకర్తను తొలగించాలని ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. మంత్రి అనుచరుడైన నాయకుడి ఒత్తిడి భరించలేక అంగన్వాడీ కేంద్రం స్టాక్ వివరాలు టిడిపి నాయకుడికి చూపించాలని కార్యకర్తపై ప్రాజెక్టు అధికారులు కూడా ఆదేశించారనే వాదనలు వినిపిస్తున్నాయి.

వ్యాన్ బోల్తాపడడంతో కిందపడ్డ టమోటాలు, కూరగాయలు

బోల్తా పడిన టమోటా వ్యాన్

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కునేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అర్తాం నుంచి కోటిపాం వరకు నాలుగు ప్రదేశాల్లో రోడ్డులు అధ్వానంగా మారడంతో ప్రతి గంటకు ఏదో ఒక వాహనం పడిపోయాయో, ఒరిగిపోయాయో ప్రమాదాలు బారిన పడుతున్నాయి. శనివారం రాయగడ్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ రోడ్డు మధ్యలో గోతుల్లో దిగిపోయి మరమ్మతులకు గురైంది. దీంతో సదుపాయం లేకపోవడంతో పక్క నుంచి పార్వతీపురం నుంచి కూనేరు వైపు వెళ్తున్న కూరగాయల వ్యాను రోడ్డు పక్కనున్న గోతుల వద్ద బోల్తాపడడంతో సుమారు రూ.40 వేల టమోటా, మిగిలిన కూరగాయలు రోడ్డుపై నేలమట్టమయ్యాయి. టమోటా అధిక ధర ఉన్న సమయంలో ఇలా అమ్మకానికి తీసుకెళ్తున్న సమయంలో ఇలా ప్రమాదంలో నేలమట్టం కావడంతో ఆ రైతులు కన్నీరు వాపోతున్నారు. ఈ నష్టాన్ని భరించాలంటే నెల రోజులు కష్టపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులంటున్నారు. స్థానికుల సహాయంతో కొంతమేరకు పడిపోయిన కూరగాయలను తిరిగి ఇతర వాహనంలో ఆ రైతులు ఒడిస్సాకు తరలించారు.

గొల్లవానివలస పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొల్లవానివలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ-1 ఎస్.సింహాచలం శనివారం సందర్శించారు. 3,4,5 తరగతుల విద్యా అభ్యసన స్థాయిలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మూడో తరగతి విద్యార్థులు ఆంగ్ల పాఠ్యాంశాన్ని ధారాళంగా చదవడం పట్ల విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, విద్యార్థుల ఎన్రోల్మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సీతంపేట : స్థానిక బాలుర ఆశ్రమ స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ శనివారం జీసీడీవో రాములమ్మ సందర్శించారు. లీప్ యాప్ ప్రతి ఒక్కరు రోజూ 9 గంటల్లోపు వేయాలని అన్నారు. డ్రాప్ ఔట్స్ లేకుండా చూడాలని సూచించారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. జ్వరాలు వస్తే వెంటనే స్పందించి హాస్పిటల్‌కు తరలించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

21న బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతానగరం

మండల కేంద్రమైన సీతానగరంలో ఈనెల 21న బాబు షూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు శనివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకు ప్రజల్ని దోచుకుతినేందుకు తాపత్రయపడితే వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలిచి వారికి మేలు జరిగేలా పోరాడాలన్నారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ - చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ కార్యక్రమంలో వందలాది మంది పార్టీ శ్రేణులు సమక్షంలో జోగారావు క్యూ అర్ కోడ్‌ను ప్రదర్శించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ఎంపిపి బలగ రమణమ్మ, మహిళా విభాగం అధ్యక్షులు దాసరి నాగరత్నం, రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి నడిమింటి రామకృష్ణ, ఎక్స్ ఎంపిపి శనాపతి ప్రసాద్ పాత్రుడు, రైతు విభాగం అధ్యక్షుడు ఆర్వీ, సీనియర్ నాయకులు మఠ్రాపూ ధనుంజయ్, పోల ఈశ్వరనారాయణ, బురిడి సూర్యనారాయణ, మండల యువజన విభాగం అధ్యక్షులు దాసరి కిషోర్, బొంగురు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ - చిన్న భోగిలి రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. వెంకట బైరిపురం నుంచి వస్తున్న బైకులు ఎదురుగా వస్తున్న మరో బైకును ములక్కావలస సమీపాన ఢీకొన్నాయి. ఈ సంఘటనలో వెంకటబైరిపురం గ్రామానికి చెందిన గంట సాగర్, మక్కువకు చెందిన కె.తనీష్ కుమార్, చోడవరపు జస్వంత్, చెముడుకు చెందిన వి.వంశీ గాయపడ్డారు. వీరికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. తనీష్ కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

హక్కులను కాలరాస్తారా ?

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తారా అని మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు వైసిపి నాయకులపై ధ్వజమెత్తారు. మండలంలోని మాదలంగి లో కూటమి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జియ్యమ్మవలస మండలానికి చెందిన మణి అనే వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్ట్ సామాజిక మాధ్యమంలో, కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ మంత్రి పుష్పశ్రీ వాణి ఇలాంటి పోకడలు ఖండించకుండా సమర్ధించడం దారుణ మన్నారు. మీ వైఫల్యం నుంచి ప్రజలను పక్కదోవ పట్టించ డానికి స్థానిక ఎమ్మెల్యేపై మీరు చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యేపై చేస్తున్న వ్యక్తిగత విమర్శలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశం లో ఎఎంసి వైస్ చైర్మన్ గారగౌరి శంకర్, మండలం జనసేన కన్వీనర్ శ్రీకర్, బిజెపి నాయకులు సురేష్, పాల్గొన్నారు.

వరి సాగులో కొత్త పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

డ్రం సీడర్ పద్ధతిలో వరి నాటుకున్నట్లయితే రైతుకు సమయం, పెట్టుబడి ఆదా అవుతుందని, ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ అవలంబించి లాభం చేకూర్చేలా పెట్టుబడులను తగ్గించుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కె.శిరీష తెలిపారు. శనివారం మరిపల్లి పంచాయతీ రేగాపువలసలో కె.రామకృష్ణ వరి పొలంలో డ్రమ్ సీడర్‌తో వరిని నాటే విధానాన్ని రైతులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రమ్ సీడర్‌తో వరి నాటడం వల్ల రైతుకు విత్తనాలు ఆదా, నారు వేయడం ఆకు తీయడం ఉడవ టానికి కూలీలు తగ్గి పెట్టు కూడా తగ్గుతుందని అన్నారు. ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, ఎఇఒ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోం'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పై మాజీ మంత్రి పి.పుష్ప శ్రీవాణి తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని మండల టిడిపి కన్వీనర్ అడ్డాకుల నరేష్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు మాట్లాడారు. అభివృద్ధి జరగలేదని మాటి మాటికి మాట్లాడుతున్న పుష్ప శ్రీవాణి పదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చూపించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఏడాదిలోనే రోడ్డు నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆయా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేలా కృషి చేస్తున్నారని అన్నారు. పుష్ప శ్రీవాణి ప్రెస్ మీట్ పెట్టి కురుపాం నియోజకవర్గం అభివృద్ధి చేయకుండా ప్రతి పనికి డబ్బులు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే జగదీశ్వరిని ఉద్దేశించి అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియోజకవర్గం అభివృద్ధికి మీ సూచనలు ఇస్తే దాని స్వీకరించి అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా మన్నారు. అలాగే గిరిజనులపై హేళన చేసి మాట్లాడడం సబబు కాదన్నారు. గత ఐదేళ్లలో వైసిపీ హయాంలోనే అభివృద్ధి చేసామనడం హాస్యాస్పదమని అన్నారు.

మహారాజశ్రీ సాలూరు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.142/2024

Between :
గొంప సింహాచలం వగైరాలు ....వాదులు
And :
గొంప ప్రసాదు వగైరాలు ..... ప్రతివాదులు
To
Defendant No.1
గొంప ప్రసాదు S/o లేటు గురువులు, వ॥ 40 సం॥లు, చినహరిజనపేట, సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా.

పై దావాలో 1వ ప్రతివాది అయిన మీకు పై కోర్టువారు వాదులు మీపైన దాఖలు చేసిన దావాలో దావా సమన్లు పంపించినప్పటికి మీరు దావా సమను అందుకోనందున శ్రీ కోర్టువారు మీకు దావా సమను ఈ పేపరు ప్రకటన ద్వారా జారీ చేసి పై దావాను **తే 05-08-2025దీ** నాటికి వాయిదా వేసినారు. కావున మీకు పై దావాలో ఆక్షేపణలు ఉన్న యెడల పై తేదీనాడు **ఉదయం గం॥ 10-30 ని॥ల**కు పై కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలియజేయ వలెను. లేని యెడల పై దావాను శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తగు ఆర్డర్లు జారీ చేయుదురని యిందుమూలంగా తెలియజేయడమైనది.

శ్రీ లావుడి ఏకదంతేశ్వరరావు
వాదుల తరుపు న్యాయవాది,
లావుడివీధి, సాలూరు,
సెల్ : 9440913367